క్లుప్తంగా

వైభవంగా కంచికామాక్షి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గణపవరం బాలయ్య చెరువు వద్ద ఉన్న కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, శాంతి పూజలు, గోపూజలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికామాక్షి అమ్మవారి నూతన ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను ప్రతిష్ఠించిన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తెలగారెడ్డి బాబి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహాయం

దెందులూరు: విద్యాభివృద్ధే లక్ష్యంగా తిరుమల మిల్క్‌డెయిరీ సంస్థ యాజమాన్యం సహాయ సహకారాలు అందిస్తోందని మండలంలోని శింగవరం గ్రామంలోని ప్లాంట్ హెచ్‌ఆర్ మేనేజర్ మల్లికార్జున్ శనివారం తెలిపారు. గుండుగొలను ఉన్నత పాఠశాలకు రూ. 8 లక్షలతో 10 కంప్యూటర్లు, రూ. 2లక్షల విలువైన 10 కుర్చీలు, 10 టేబుళ్లు, ఫర్నిచర్‌ను అందించామన్నారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమక్షంలో వాటిని అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెడ్ లారెంట్, రీజనల్ హెచ్‌ఆర్ మేనేజర్ రాజమోహన్, ప్లాంట్ మేనేజర్ అమిత్, ఫ్రెడ్రిక్ ఉన్నారు.

పెదవేగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదవేగి : పెదవేగిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విద్యాలయం ప్రిన్సిపాల్ పనిచేసిన ఎస్. భారతి జంగారెడ్డిగూడెం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావు కృష్ణాజిల్లా తిరువూరులోని గురుకుల విద్యాలయం అధ్యాపకునిగా పనిచేస్తూ బదిలీపై పెదవేగి వచ్చారు. ఆయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీడీ కె.జయరాజు, ఉపాధ్యాయులు ఆచార్యులు, శివప్రసాద్, శ్రీనివాస్, సిబ్బంది, శ్రీనివాసరావుకు పుష్పగుచ్చం అందించి, అభినందించారు.

ఇఫ్టూ నేత అప్పారావుకు గాయాలు

ఏలూరు (టూటౌన్): రోడ్డు ప్రమాదంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు కాకర్ల అప్పారావుకి గాయాలయ్యాయి. శనివారం ఉదయం కొబ్బరితోటలోని తన నివాసం నుంచి ఇఫ్టూ కార్యాలయానికి సైకిల్‌పై వస్తుండగా జూట్ మిల్లు సెంటర్లో వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. దీంతో అప్పారావు కాలు పూర్తిగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఇఫ్టూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు 108 వాహనంలో అప్పారావును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇఫ్టూ నాయకులు పి.ప్రసాద్, కె.పోలారి, ఎస్ రామ్మోహన్, ఎ.రవిచంద్ర, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ అప్పారావును పరామర్శించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో హెల్త్ ఆఫీసర్ బీవీ నగేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 88 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, దీనిని ఏలూరు, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లాయర్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, చెన్న వెంకట రామయ్య, బొలిశెట్టి సురేష్, అల్లం వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, ఆకుకూరల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక లెప్రసీ కాలనీ పేదలకు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, ఆకుకూరలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు టి.అబ్రహాం లింకన్, లయన్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ ప్రగళ్లపాటి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేళ్ల వెంకటేశ్వరరావు, వీజీఎంవీఆర్ కృష్ణారావు, మారగాని శ్రీనివాసరావు, షేక్ ముస్తాఫా అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ నేతృత్వంలో ఆదర్శవంతమైన సుపరిపాలన

- అన్ని వర్గాల మేలు కోసమే అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలు
- దేశానికే తలమానికంగా సచివాలయ వ్యవస్థ
- సూరప్పగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



సూరప్పగూడెంలో బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గాలాయగూడెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు

భీమడోలు: దేశంలోనే ఆదర్శవంతమైన సుపరిపాలనను అందిస్తూ ప్రజల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానాన్ని చూరగొన్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. 166వ రోజైన శనివారం రాత్రి సూరప్పగూడెంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను వారికి అందించారు. సంక్షేమ పథకాలు అందుకునే తరుణంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని విద్యుత్ సమస్యలు డ్రైనేజీ వ్యవస్థ సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యే వాసుబాబుకు విన్నవించారు. ప్రతి ఇంటి వద్ద వృద్ధులు, మహిళలు, లబ్ధిదారులు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును ఆప్యాయంగా పలకరించారు. రాజకీయాలు, కులమతాలకు తావివ్వకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకం పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రజలందరికీ సుపరిపాలనను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను చేరవేస్తున్నారన్నారు. ఈ వ్యవస్థ దేశానికే తలమానికంగా మారిందని, అన్ని రాష్ట్రాలకు ఏపీ వైపు చూస్తున్నారన్నారు. పదవీ ఆకాంక్షతో చంద్రబాబు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించి ప్రజలను మోసం చేసేందుకు కంకణం కట్టుకున్నాడన్నారు. ప్రజలంతా చంద్రబాబుకు మరోసారి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, పేదలకు అందిస్తున్న జగనన్న గృహాలను సైతం అపహాస్యం చేసి మాట్లాడుతున్నాడన్నారు. మాట తప్పని, మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి నాగ మల్లేశ్వరరావు, వెజ్జు అన్నవరం, ఉపసర్పంచ్ పంతుల గణేష్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, సచివాలయ కన్వీనర్ పంతుల రమేష్, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ సవలం నాని, నాయకులు వెంపా వెంకట్రావు, మన్నే ముసలయ్య, దొడ్డిగర్ల నాగరాజు, మద్దాల అప్పారావు, ఎస్‌కే భాషా, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేయడమే ధ్యేయం

దెందులూరు: పేదలకు మేలు చేయడమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలుతో పాటు, అనేక కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఆయన అన్నారు.మండలంలోని గాలాయగూడెంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైద్యం, ఇంటి స్థలం, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లల్లో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించామని, ఇప్పుడు ధైర్యంగా తామంతా గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి కష్ట సుఖాలు తెలుసుకోగలుగుతున్నామని ఆయన అన్నారు. అమలు చేసిన అభివృద్ధి, పథకాలను ఆధారాలతో చూపించి వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని ప్రజలను కోరుతున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అన్ని వర్గాల ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రణాళికతో సేవలందించే ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం విస్మరించారన్నారు. వైఎస్సార్ సీపీని ప్రజలు వచ్చే ఎన్నికలలో ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఎఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, మరీదు రాజా, వలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

గాలాయగూడెం గ్రామానికి విచ్చేసిన కొఠారు అబ్బయ్యచౌదరిని గ్రామ వీఆర్వో పసుపులేటి విష్ణు, కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్‌కు ఘన నివాళులు



పూళ్లలో వట్టి వసంతకుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రక్తదానం చేస్తున్న యువకులు

ఉంగుటూరు: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ తన రాజకీయ జీవితంలో అవినీతికి తావు లేకుండా పనిచేసి ప్రజామన్ననలను అందుకున్నారని పలువురు వక్తలు అన్నారు. శనివారం ఉంగుటూరులో దివంగత వట్టి వసంత్‌కుమార్ 70వ జయంతిని అభిమానులు, వసంత్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. యువకులు పెద్ద ఎత్తున వసంత్ యూత్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. కళాకారుడు చల్లా సూర్యారావుకు డీసీసీబీ మాజీ డైరెక్టరు మైలవరపు గోపాలకృష్ణ 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పూళ్ల నుంచి ఉంగుటూరు వరకూ భారీగా అభిమానులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాటి కిరణ్, శ్రీనివాసరెడ్డి, వసంత్ యూత్ అధ్యక్షుడు ముత్యాల బాలాజీ, గట్టిం నాని, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

భీమడోలు: దివంగత ఉమ్మడి రాష్ట్రాల మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ 70వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పూళ్ల, ఎంఎంపురం, భీమడోలులో పార్టీలకతీతంగా వసంత్‌కుమార్ అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన స్వగ్రామం ఎంఎంపురంలో వసంత్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పూళ్ల, భీమడోలు పీహెచ్‌సీల్లో రోగులకు పండ్లు, ప్రత్యేక కిట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు, కోఆప్షన్ సభ్యుడు ఆజామ్, నాయకులు వర్దినీడి సాయి, వైద్యులు, మానవత నాయకులు పాల్గొన్నారు.

వట్టి వసంత్‌కుమార్ సేవలు మరువలేనివి

గణపవరం: మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ రాజకీయ జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శమని పలువురు అన్నారు. శనివారం వట్టి వసంతకుమార్ జయంతి సందర్భంగా గణపవరంలో ఆయన అభిమానులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. సంతమార్కెట్, చేపలమార్కెట్ ఏరియాలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయసలహాసంఘం చైర్మన్ కె.జగపతిరాజు, జనసేన నాయకులు ముత్యాల వాసు, ముత్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



దెందులూరులో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో సమన్వయంతో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖాధికారులు సేవలందిస్తూ జగనన్న ఇళ్ల నిర్మాణాల లక్ష్యసాధనకు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గానికి చెందిన గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో జగనన్న ఇళ్ల నిర్మాణం, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాల్లో స్థల సేకరణ, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ, లక్ష్యాల సాధనపై దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల వారీగా సమీక్ష చేశారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయడం వల్ల సత్ఫలితాలు లభించాయని, ఇదే స్ఫూర్తితో మరింత వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణానికి లక్ష్యాల సాధనకు సేవలందించాలని కోరారు. సమీక్ష సమావేశంలో దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలి



పూళ్లలో బాలికకు బహుమతులు అందజేస్తున్న పుప్పాల హరీష్



భీమడోలు గ్రంథాలయంలో చిన్నారులకు నీతి కథలు చెబుతున్న మండే సుధాకర్

భీమడోలు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని చిన్నారులంతా ఉన్నత స్థితికి చేరుకోవాలని దాత పుప్పాల హరీష్ అన్నారు. పూళ్ల తోట వెంకట్రామయ్య స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. దాత పుప్పాల హరీష్ ఆర్థిక సాయంతో రూ.17వేలతో లైబ్రరీకి అవసరమైన ఆట వస్తువులు, మైక్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రంథపాలకుడు డీఎన్‌బీ అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ మాట్లాడుతూ గ్రంథాలయ నిర్మాణంలో దివంగత సర్పంచ్ పుప్పాల మోహన సీతారామయ్య కృషి చేసారని ఆయన బాటలో గ్రంథాలయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. యోగా, భగవద్గీత శ్లోకాలు నేర్పిన గురువులు గేదెల ఈశ్వరమ్మ, కుర్రెళ్ల కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, పెద్దలు కల్లి నారాయణ అప్పారావు, సుంకర ఆంజనేయులు, దాసం మంగయ్య, తోట పెద్దబాబు, వీవీ ప్రభాకర రావు, ఎం.జయరామ్ పాల్గొన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో 34వ రోజైన శనివారం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు డ్యాన్స్ పోటీలను నిర్వహించారు.

దేశభక్తి గీతాలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

పెదవేగి : దేశభక్తి గీతాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని రీసోర్స్ పర్సన్ చాపల సర్వేశ్వరరావు అన్నారు. పెదవేగి లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం దేశభక్తి గీతాలపై అవగాహన, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ సర్వేశ్వరరావు, గ్రంథపాలకుడు తోట అరుణ కుమార్ పాల్గొన్నారు.

కౌలుదారులను ఆదుకోవాలి



పూళ్లలో నిర్వహించిన ప్రచారయాత్రలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

భీమడోలు: వ్యవసాయం చేసే రైతన్నలు, కౌలుదారులను ప్రభుత్వాలు ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా కార్యక్రమంలో భాగంగా శనివారం పూళ్ల, కుర్రెళ్లగూడెం, గుండుగొలను గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు చట్టాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన పంట సాగుదారు హక్కు చట్టం వల్ల కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌలు సాగుదారు హక్కు పత్రాలు పొందాలంటే భూ యాజమాని సంతకాలు కావాలన్న నిబంధన సరికాదన్నారు. భూ యాజమాని సంతకాలు అవసరం లేకుండా సంబంధిత అధికారులు కౌలుదారుల కార్డులను ఇవ్వాలన్నారు. కష్టపడి పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ, కౌలు రైతుల సంఘం నాయకులు కె.అప్పారావు, వి.శ్రీరామచంద్రమూర్తి, జి.కృష్ణ బాలాజీ, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

కౌలుదారులకు రైతుభరోసా అందించాలి

ఉంగుటూరు: పంటలు పండించే రైతులకు, కౌలుదారులకు రైతు భరోసా పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ కోరారు. శనివారం ఏపీ కౌలు రైతు సంఘం చేపట్టిన ప్రచార జాతా శనివారం ఉంగుటూరు మండలంలోని నారాయణపురం, చేబ్రోలు కైకరంలో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసు, గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీఆమ చంద్రమూర్తి పాల్గొన్నారు.

సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌కు హెచ్‌ఎంగా పదోన్నతి

దెందులూరు: చల్లచింతలపూడి ఉన్నత పాఠశాల సైన్స్ స్కూల్ అసిస్టెంట్ వడ్లపట్ల విజయ్‌కుమార్‌కు శనివారం ఉంగుటూరు మండలం రాచూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన హెచ్‌ఎంను సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, పేరెంట్స్ కమిటీ, ఎండీఎం కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి ఘనంగా సత్కరించారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఉపాధ్యాయులు



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును అభినందిస్తున్న పెదపాడు మండల ఉపాధ్యాయులు

పెదపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు ప్రయత్నం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. శనివారం మండలంలోని ఉపాధ్యాయులంతా కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగప్రసాద్, జీ సాంబశివరావు, శరత్, తోట ప్రసాద్, ఆరవల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వడ్డిగూడెం మాజీ సర్పంచ్ మోరు పెద సుబ్బరాజు, పలువురు గ్రామ పెద్దలు జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తినాతి విజయ్, రమేష్ పాల్గొన్నారు.

24 మంది స్కూల్ అసిస్టెంట్ల చేరిక



జాయినింగ్, రిలీవింగ్ రిపోర్టులు అందిస్తున్న ఎంఈవో పుచ్చల శేషు

నిడమర్రు: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలో 24 మంది బదిలీలు, పదోన్నతులపై 24 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం నిడమర్రు మండలానికి వచ్చినట్లు ఎంఈవో పుచ్చల శేషు తెలిపారు. గణపవరం, ఏలూరు తదితర మండలాల నుంచి బువ్వనపల్లి యూపీ స్కూల్ తోపాటు, 7 జెడ్పీ స్కూళ్లకు కొత్తగా బదిలీపై స్కూల్ అసిస్టెంట్ టీచర్లు వచ్చారు. వారు పాఠశాలల్లో శనివారం విధుల్లో చేరారు. మండలంలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న టీచర్లకు శనివారం రాత్రి జాయినింగ్ ఆర్డర్లు ఆన్‌లైన్‌లో అందుతాయన్నారు. వీరందరూ ఆదివారం కేటాయించిన స్కూళ్లలో చేరాలన్నారు. సోమవారంతో ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. భాషోపాధ్యాయుల పదోన్నతులు పూర్తవ్వాల్సి ఉంద న్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పదోన్నతిపై జాయినింగ్ ఆర్డర్లు తీసుకున్న వారిలో సీహెచ్ లీలా గోపాల్, సీహెచ్ భారతిలక్ష్మీకుమారి, పల్లా నరసింహమూర్తి, ఏఆర్‌కే కుమార్, బయాలజికల్ సైన్స్ పదోన్నతి తీసుకున్నవారిలో తాడి గోపాలకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో యూపీ స్కూల్ హెచ్‌ఎం సంకు ఏసు, ఉపాధ్యాయులు జె. ఏసు, దంగేటి సత్యనారాయణ తదితరులున్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదవేగి : రెండు వేర్వేరు ప్రదేశాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,800 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అనంతరం పెదవేగి మండలం దిబ్బగూడెం – లక్ష్మీపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ఇతర సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 2,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు: మండలంలోని అప్పనవీడు శివారు తాళ్లమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 9న బుట్టాయిగూడెం మండలం నిమ్మలవారి గూడెంకు చెందిన మొండూరు అనిల్ కుమార్ (27) వరుసకు సోదరి అయిన జయరమ్యను వట్లూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల నుంచి మోటారు సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం అనిల్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కృష్ణా చల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై పనులు చేస్తోన్న ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు 16 నెంబర్ జాతీయ రహదారిపై పనులు చేసేందుకొచ్చారు. శనివారం ఉదయం ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ సమీపంలో డివైడర్‌పై పిచ్చి మొక్కలు తొలగించి ట్రాక్టర్ ట్రక్కులో వేస్తున్నారు. విజయవాడ నుంచి గుండుగొలను వైపు వెళ్లే ఒక కంటైనర్ అతివేగంగా ట్రాక్టర్ ట్రక్కును ఢీకొంది. ఈ ట్రక్కు పక్కనే పనిచేస్తోన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన గణేష్ (25) అనే యువకుడిపై పడింది. యువకుడు గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దేవదాయధర్మదాయ శాఖ
భూములు బహిరంగ వేలం ప్రకటన (3వ సారి)

ఏలూరు జిల్లా,దెందులూరు మండలం, పోతునూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భోగేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన ఆర్.యస్.నెం.275/2, 276 లలో య 4-32 ట్లు భూమిని సేద్యం చేసుకొనుటకు గాను 3 సం॥ల కాలపరిమితికి అనగా 2023-24 నుండి 2025-26 వరకు ది.21.06.2023 ఉ॥ 11.00 లకు దేవదాయ ధర్మదాయ అధికారుల సమక్షమున శ్రీ స్వామి వారి ఆలయ ప్రాంగణం నందు బహిరంగ వేలం పెట్టబడును. ఆసక్తి గల వారు రూ.15,000/-లు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

తేది : 11.06.2023 — కార్యనిర్వహణాధికారి